# దంపతుల దారుణ హత్య... నిందితుడి అరెస్టు

**- ఫోన్ కాల్ ద్వారా నిందితుడిని గుర్తించాం**

**- సీపీ సుధీర్ బాబు**



దంపతుల హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్ బాబు



నిందితుడు హత్యలకు ఉపయోగించిన ఆయుధాలను చూపిస్తున్న సీపీ

నాగోల్, అక్టోబర్ 19(ఆంధ్రప్రభ) : కందుకూరులోని వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం రాత్రి జరిగిన వృద్ధ దంపతుల హత్యతో పాటు, గతేడాది జరిగిన మరో మహిళ హత్య కేసును రాచకొండ పోలీసులు ఛేదించారు. ఆ కేసు లకు సంబంధించిన పూర్తి వివరాలను శనివారం రాచకొండ సీపీ క్యాంపు కార్యాలయం ఎల్బీనగర్‌లో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు వెళ్ళడించారు. మృతుడు ఊషయ్యకు వచ్చిన ఫోన్ కాల్ ఆధారంగా నిందితుడిని గుర్తించామని, ఏడాది క్రితం జరిగిన హత్య కేసులో దొరికిన ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా ఆ కేసు ఛేదించమన్నారు. దంపతుల వద్ద దొరికిన ఫింగర్ ప్రింట్స్, మహిళా హత్య కేసులో దొరికిన ఫింగర్ ప్రింట్స్ ఒకేలా ఉన్నాయన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన ఊషయ్య (70), భార్య శాంతమ్మ (65) కందుకూరు మండలంలోని కొత్తగూడ రెవెన్యూ పరిధిలో మనోహర్ రావు వ్యవసాయ క్షేత్రంలో ఉంటున్నారు. గత ఏడేళ్లుగా వ్యవసాయ పనులు చేస్తూ జీవనోపాధి కొనసాగిస్తున్నారు. బుధవారం వ్యవసాయ క్షేత్రయజమాని మనోహర్ రావు ప్రతిరోజు మాదిరిగానే బుధవారం ఉదయం ఫోన్ చేయగా వృద్ధ దంపతులు స్పందించలేదు. దీంతో వ్యవసాయ క్షేత్రంలో ట్రాక్టర్ పనులు నిర్వహించేవ్యక్తికి ఫోన్ చేసి వృద్ధ దంపతులు ఫోను ఎత్తడం లేదని, ఒకసారి వెళ్లి చూడమని చెప్పారు. అతను వ్యవసాయక్షేత్రానికి వెళ్లి చూడగా శాంతమ్మ రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండడం చూసి భయపడి చుట్టు పక్కల ఉన్న రైతులక సమాచారం ఇచ్చాడు. వెంటనే శాంతమ్మ భర్త కూడా కనిపించకపోవడంతో తోటలో వెతకగా కొంతదూరంలో దారుణ హత్యకు గురై కనిపించిన ఊశయ్యను చూసి వెంటనే యజమానికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈ మేరకు యజమాని స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ద్వారా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. హత్యకు గురైన ఉషయ్య ఫోన్ నుంచి ఫోన్ కాల్ పోవడం ద్వారా అనుమానం తో ఫోన్ కాల్ లిస్టు తో నిందితుడు ఉప్పుల శివకుమార్ (25)గా గుర్తించారు. అనుమానం గా సంచరిస్తున్న శివ కుమార్ ని అదుపులోకి తీసుకొని విచారించగా శివ కుమార్ దంపతుల హత్య తానే చేసినట్లు ఒప్పుకున్నాడు. అదే విధంగా 3 మార్చి 2023 కందుకూరు మండలం దాసర్లపల్లి గ్రామం అరుణ ఫాం హౌస్‌లో జరిగిన శైలజ రెడ్డి హత్య కూడ తానే చేసినట్లు శివ కుమార్ ఒప్పుకున్నాడు. అప్పుడు హత్యకు ఉపయోగించిన ఆయుధాలపై ఉన్న ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా, ఇప్పుడు జరిగిన హత్యల ఆయుధాలపై ఉన్న ఫింగర్ ప్రింట్స్ ఒకేలా ఉండటంతో సాంకేతికంగా కూడా నిర్ధారణ జరిగిందని తెలిపారు. నిందితుడు ఉప్పుల శివకుమార్ కందుకూరు మండలం దాసర్లపల్లి గ్రామం చెందిన వ్యక్తి.ఇతడు మద్యానికి బానిసై గ్రామంలో ఎలాంటి పని చేయకుండా తిరుగుతుండేవాడు. అతడు డబ్బుల కోసం ఒంటరిగా ఉన్న మహిళా కార్మికులను ముఖ్యంగా ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న మహిళాను లక్ష్యంగా చేసుకుని అందినకాడికి డబ్బులు, మద్యం మత్తులో లైంగిక కోరికలు తీర్చుకునే వాడని, మహిళలు ప్రతిఘటించినప్పుడు అతడు అందుబాటులో ఉన్న కత్తులు, కొడవళ్ళతో వారి పై దాడి చేసి హతమారుస్తాడని పేర్కొన్నారు. ఇంత త్వరితగతిన కేసును ఛేదించిన రాచకొండ క్రైం బ్రాంచ్ పోలీసులను, కందుకూరు పోలీసులను రాచకొండ సీపీ సుధీర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు.

# లైంగికదాడిని అడ్డుకున్నందుకే హత్యలు

## వృద్ధ దంపతుల హత్య కేసును ఛేదించిన కందుకూరు పోలీసులు

## విచారణలో బయటపడిన మరో మహిళ హత్య కేసు..


## సెల్‌ఫోన్ కాల్‌లిస్ట్‌తో నిందితుడు అరెస్టు

మన్సూరాబాద్, అక్టోబర్ 19: కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 16న జరిగిన వృద్ధ దంపతుల హత్య కేసును పోలీసులు ఛేదించారు. సెల్‌ఫోన్‌లో లభించిన క్లూతో నిందితుడిని పట్టుకున్నారు. లైంగికదాడికి యత్నించే క్రమంలో వృద్ధురాలిని హత్యచేసి.. ఆపై ఆమె భర్తను హత్యచేసినట్లు తేలింది. ఈ కేసులో నిందితుడి ఫ్రింగర్ ప్రింట్‌ను పరిశీలించగా.. సంవత్సరంన్నర క్రితం జరిగిన మరో మహిళ హత్య విషయం బయటపడింది. ఈ హత్య కేసుల్లో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎల్బీనగర్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ సుధీర్‌బాబు కేసు వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలం, ముస్తిపల్లి గ్రామానికి చెందిన మూగ ఊశయ్య (70), మూగ శాంతమ్మ (65) దంపతులు.. అదే గ్రామానికి చెందిన మనోహర్‌కు చెందిన కందుకూరు, కొత్తగూడ గ్రామ పరిధిలో ఉన్న మామిడితోటలో పని చేస్తూ అక్కడే ఉంటున్నారు. ఈనెల 16న ఉదయం ఆ వృద్ధ దంపతులు దారుణ హత్యకు గురయ్యారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### వెలుగులోకి ఇలా..

పోలీసుల దర్యాప్తులో భాగంగా హత్యకు గురైన ఊశయ్య సెల్‌ఫోన్‌కు వచ్చిన ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ కాల్స్‌ను పరిశీలించారు. ఇందులో లభించిన సమాచారం మేరకు కందుకూరు మండలం, దాసర్ల



పల్లి గ్రామానికి చెందిన ఉప్పుల శివకుమార్ (25)పై అనుమానంతో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో హత్య విషయం బయటపడింది. మనోహర్‌కు చెందిన మామిడి తోటలో మూడు ఎకరాలను కందుకూరుకు చెందిన మహేశ్ అనే వ్యక్తి కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. మామిడితోటకు శివకుమార్‌ను బోరు పని కోసం మహేశ్ తీసుకువస్తుండేవాడు. ఈ క్రమంలో శివకుమార్ చూపు వృద్ధ దంపతులపై పడింది. ఒంటరిగా ఉంటున్నట్టు గుర్తించి.. ఈనెల 15న రాత్రి మామిడితోటకు వచ్చి శాంతమ్మపై లైంగిక దాడికి యత్నించగా ఆమె తీవ్రంగా ప్రతిఘటించింది. దీంతో ఆమెను కత్తితో పొడిచి హత్య చేశాడు. అడ్డుగా వచ్చిన ఆమె భర్త ఊశయ్యను సైతం హత్య చేసి పరారయ్యాడు. శుక్రవారం సాయంత్రం 5:30 గంటల సమయంలో నేదునూరు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఉప్పుల శివకుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే.. వృద్ధ దంపతులను హత్య చేసిన అనంతరం ఫుల్‌గా మద్యం సేవించి ఉన్న శివకుమార్‌కు తన సెల్‌ఫోన్ కనిపించలేదు. దీంతో హత్యకు గురైన ఊశయ్య సెల్‌ఫోన్ నుంచి తన సెల్‌కు ఫోన్ చేశాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. మద్యం మత్తులో ఉన్న శివకుమార్ తన సెల్‌ఫోన్ ఇంట్లో పెట్టి వచ్చిన విషయాన్ని మరచి.. ఊశయ్య సెల్‌ఫోన్ నుంచి ఫోన్ చేయడంతో పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు. నిందితుడు శివకుమార్ ఫింగర్ ప్రింట్ చూడగా.. సంవత్సరంన్నర క్రితం జరిగిన మహిళ హత్య కేసులో లభించిన ఫింగర్ ప్రింట్ ఒక్కటేనని తెలిసింది .

### విచారణలో మరో మహిళ హత్య కేసు

దంపతుల హత్య కేసును లోతుగా విచారణ చేపట్టిన కందుకూరు పోలీసులకు విస్తుపోయే నిజాలు తెలిశాయి. మద్యానికి బానిసగా మారిన ఉప్పుల శివకుమార్ తాగిన మైకంలో ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకుని హత్యలు చేస్తున్న విషయం బయటపడింది. ఏపీ, నెల్లూరు జిల్లా, ఒజిలి మండలం, మనవల్లి గ్రామానికి చెందిన నరేందర్‌రెడ్డి తన భార్య శైలజారెడ్డి (42), కుమారుడు క్రిష్ణారెడ్డితో కలిసి కందుకూరు మండలం, దాసర్లపల్లి గ్రామంలోని అరుణ ఫాంహౌజ్‌లో నివాసముండేవారు. కాగా.. 03-03-2023న రాత్రి 7:50 గంటల సమయంలో ఒంటరిగా ఉన్న శైలజారెడ్డిపై ఉప్పుల శివకుమార్ లైంగికదాడికి యత్నించగా.. ఆమె ప్రతిఘటించడంతో యాక్సా బ్లేడుతో గొంతు కోసి హత్య చేసి పరారయ్యాడు. నాటి నుంచి శివకుమార్ పరారీలో ఉన్నాడు. హత్య జరిగిన ప్రాంతం వద్ద లభించిన యాక్సా బ్లేడుపై లభించిన నిందితుడి ఫింగర్ ప్రింట్లను పోలీసులు సేకరించారు.. అయితే... వృద్ధ దంపతుల హత్య కేసులో అరెస్ట్ అయిన శివకుమార్ ఫింగర్ ప్రింట్‌ను పోల్చి చూడగా.. శైలజారెడ్డి హత్య కేసు మిస్టరీ వీడింది. ముగ్గురిని హత్య చేసిన నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తితో పాటు బైకు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

# ఫోన్ కాల్ పట్టించింది!

## ఫోన్ ఇంట్లో ఉన్న విషయం మద్యం మత్తులో మర్చిపోయిన నిందితుడు

- హతుడి ఫోన్ నుంచే తన మొబైల్‌కు కాల్
- ఈ క్లూతోనే జంటహత్యల కేసును ఛేదించిన పోలీసులు
- విచారణలో ఏడాదిన్నర క్రితం హత్య కేసు కూడా వెలుగులోకి..
- రాచకొండ సీపీ సుధీర్ బాబు వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు

సాక్షి, సిటీబ్యూరో: మద్యం మత్తులో ఇంట్లో ఫోన్ పెట్టి వచ్చానన్న విషయం మర్చిపోయిన నిందితుడు.. హతుడి ఫోన్ నుంచే తన ఫోన్‌కు కాల్ చేసుకున్నాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండటంతో కంగారులో ఫోన్ డయల్ లిస్ట్ నుంచి నంబర్‌ను డిలీట్ చేయకుండానే ఘటనాస్థలం నుంచి వెళ్లిపోయాడు. హంతకుడి ఈ నిర్లక్ష్యమే జంటహత్యల కేసు ఛేదించడానికి ఆధారమైంది. కేసు వివరాలను రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు శనివారం మీడియాకు వెల్లడించారు.


నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన మూగ హోసయ్య, శాంతమ్మ దంపతులు కొత్తగూడలోని మ్యాంగో ఆర్చిడ్స్ ఫామ్‌హౌస్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. దాసర్లపల్లి గ్రామానికి చెందిన ఉప్పుల శివ ఈ నెల 16న సాయంత్రం హోసయ్య ఇంట్లో లేని సమయం చూసి మద్యం సేవించిన ఫామ్ హౌస్‌లోకి చొరబడ్డాడు. వంటచేస్తున్న శాంతమ్మపై అత్యాచారానికి యత్నించగా ఆమె ప్రతిఘటించింది. అక్కడే ఉన్న కొడవలితో ఆమెను హత్యచేశాడు. ఇదే సమయంలో ఇంటి వైపు వచ్చిన హోసయ్య రక్తం మడుగులో కొట్టుమిట్టాడుతున్న భార్యను, ఇంట్లో నుంచి బయటికి వస్తున్న హంతకుడ్ని చూసి భయపడిపోయి పరుగులు పెట్టాడు. హోసయ్య బతికి ఉంటే పోలీసులకు సమాచారం ఇస్తాడని గ్రహించి, అతన్ని వెంబడించి సమీపంలోని స్విమ్మింగ్ పూల్ వద్ద హత్య చేశాడు.

### ఫోన్ ఎక్కడో పోయిందనుకొని..

శివ, హోసయ్య మధ్య జరిగిన పెనుగులాటలో తన ఫోన్ ఎక్కడో పడిపోయిందని నిందితుడు భావించాడు. వాస్తవానికి శివ తన ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసి, ఇంట్లోనే పెట్టి ఘటనాస్థలికి వచ్చాడు. మద్యం మత్తులో ఈ విషయాన్ని మర్చిపోయి హత్య చేసిన తర్వాత హతుడు మొబైల్ నుంచి తన ఫోన్‌కు కాల్ చేశాడు. కానీ, ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో ఎక్కడో పడిపోయిందనుకొని ఘటనాస్థలం నుంచి వెళ్లిపోయాడు.

### పోస్టుమార్టం రిపోర్ట్‌లో..

హతులు చేసిన భోజనం అరగకపోవడాన్ని వైద్యులు పోస్టుమార్టం నివేదికలో గుర్తించారు. రాత్రి 8–8:30 గంటల మధ్య వీరు భోజనం చేసి ఉంటారని తేల్చారు. అయితే ఘటనాస్థలంలో దొరికిన హోసయ్య ఫోన్ కాల్‌ను పరిశీలించిన పోలీసులకు.. అందులో 8:30 తర్వాత కూడా గుర్తుతెలియని నంబరుకు ఫోన్ కాల్ వెళ్లినట్లు గుర్తించారు. హత్య తర్వాత ఫోన్ ఎవరు చేసి ఉంటారని అనుమానించిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడు శివను గుర్తించారు.



స్వాధీనం చేసుకున్న కొడవలి, సెల్ ఫోన్, బైక్

### వైన్స్ షాప్‌కు ఫోన్..

హత్య చేసిన తర్వాత ఇంటికెళ్లిన తర్వాత శివ తన ఫోన్ ఇంట్లోనే ఉందని తెలుసుకున్నాడు. ఫోన్‌ను ఆన్ చేసి వైన్స్ షాప్‌కు ఫోన్ చేసి మద్యం దొరుకుతుందా అని ఆరా తీశాడు. అప్పటికే శివ నంబర్‌ను ట్రాక్ చేస్తున్న పోలీసులకు సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందడంతో నిందితుడి కథ కంచికి చేరింది. నెందునూర్ క్రాస్‌రోడ్ వద్ద శివను అరెస్టు చేశారు. కత్తి, దుస్తులు, బైక్, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

### హత్య చేసి ఏడాదిన్నరగా అదే ఊర్లో..

కందుకూరు ఠాణా పరిధిలో గతేడాది మార్చి 3న దాసర్లపల్లి గ్రామంలోని అరుణ ఫామ్ హౌస్‌లోనూ ఓ మహిళ హత్య జరిగింది. తాజా కేసులో అరెస్టయిన శివ కుమారే ఆమెను హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. అరుణ ఫామ్‌హౌస్‌లో పనిచేసే చెంచు శైలజారెడ్డిపై మద్యం మత్తులో శివ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆమె ప్రతిఘటించడంతో గొడ్డలితో ఆమె మెడ, వెనక భాగంలో కిరాతకంగా నరికి హత్యచేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులకు ఎలాంటి ఆధారాలు దొరకలేదు. హత్య చేసిన తర్వాతి నుంచి ఇప్పటివరకు ఏడాదిన్నర కాలంగా శివ అదే ఊర్లో తిరుగుతున్నా పోలీసులు గుర్తించలేకపోయారు. తాజా కేసులో అరెస్టు కావడం, అతడి వేలిముద్రలు సరిపోలడంతో ఆ కేసు గుట్టు కూడా రట్టయింది. శాస్త్రీయ కోణంలో కేసు దర్యాప్తు చేయకపోవడం, ఊరిలోని అనుమానితుల వేలిముద్రలను సేకరించకపోవడం వల్లే పోలీసులు నిందితుడ్ని ఏడాదిన్నర కాలంగా గుర్తించలేకపోయారని స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి.

# అధునాతన టెక్నాలజీతో జంట హత్య కేసు ఛేదన



**నవతెలంగాణ- హయత్‌నగర్**

అధునాతన టెక్నాలజీని ఉపయోగించి జంట హత్యల కేసును కందుకూరు పోలీసులు ఛేదించారు. ఎల్బీనగర్‌లో ఉన్న సీపీ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితుడి వివరాలను రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం,దాసర్ల పల్లి గ్రామానికి చెందిన ఉప్పాల శివ కుమార్.. ఇతను మద్యానికి బానిసై ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసుకుని వారిపై అత్యాచారం చేసి, వినకపోతే హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యేవాడు. కందుకూరు మండలంలోని కొత్తగూడ గ్రామంలోని 8 ఎకరాల్లో ఉన్న తోటలో నాగర్ కర్నూలు జిల్లాకు చెందిన మూగ ఉషయ్య, శాంతమ్మ దంపతులు వాచ్ మెన్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 16న వాచ్‌మెన్ దంపతులిద్దరు హత్యకు గురయ్యారు. ఫిర్యాదు రాగానే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు.. చనిపోయిన వారి ఫోన్ నుండి వచ్చిన కాల్స్ ఆధారంగా నిందితుడు కందుకూరుకు చెందిన వాడుగా గుర్తించారు. అతని ఫింగర్ ప్రింట్స్‌తో 2023 మార్చి 3న కందుకూరులో చెంచు శైలజా రెడ్డి అనే మహిళ హత్యకు కారణం ఇతడే అని పోలీసుల ముందు నేరం ఒప్పుకున్నట్లు సీపీ తెలిపారు. తదనంతరం అతన్ని రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఎల్బీనగర్ జోన్ ఎస్ఓటీ డీసీపీ మురళీధర్, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, మహేశ్వరం ఏసీపీ లక్ష్మీ కాంత్ రెడ్డి, ఐటీ సెల్ ఏసీపీ నరేందర్ గౌడ్, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, సీతారాం పాల్గొన్నారు.

# లైంగిక దాడికి యత్నం.. ఎదురుతిరిగిందని

# వృద్ధురాలిని నరికి చంపాడు

- అదే టైంలో ఇంటికి వచ్చిన భర్తనూ హత్య చేశాడు
- వీడిన మర్డర్ మిస్టరీ
- నిందితుడి అరెస్టు..

**ఎల్బీ నగర్, వెలుగు:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండలం కొత్తగూడ గ్రామంలో వృద్ధ దంపతుల హత్య కేసును రాచకొండ పోలీసులు 48 గంటల్లో ఛేదించారు. ఈ హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ ఎల్బీ నగర్ లోని క్యాంప్ సీపీ ఆఫీసులో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో సీపీ సుధీర్ బాబు వివరాలు వెల్లడించారు. కందుకూరు మండలం దాసర్లపల్లి గ్రామానికి చెందిన ఉప్పాల శివకుమార్ (25) తాగుడుకు బానిసయ్యాడు. తాగిన మత్తులో జనసంచారం లేని ప్రాంతాల్లో సంచరిస్తూ ఒంటరిగా ఉన్నవారిపై దాడులకు పాల్పడుతున్నాడు. కాగా, కొత్తగూడలోని ఫాంహౌజ్ లో పనిచేస్తున్న వృద్ధ దంపతులు మూగ శాంతమ్మ (65) , ఉషయ్య (70) ఇంటికి శివకుమార్ రాత్రి 8.30 గంటలకు వెళ్లాడు. తాగడానికి నీళ్లు కావాలని అడిగాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న శాంతమ్మపై లైంగిక దాడికి యత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో కొడవలితో ఆమెను నరికి చంపాడు. అప్పుడే ఉషయ్య ఇంటికి వచ్చాడు. ఉషయ్యను కూడా వెంబడించి కత్తితో నరికి చంపి ఇంటికి వెళ్లిపోయాడు. దీంతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఉషయ్యను చంపిన తర్వాత ఆయన ఫోన్ నుంచి ఒక కాల్ వెళ్లింది. దీని ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా.. శివకుమార్ తాగిన మత్తులో ఒంటరిగా ఉన్న మహిళపై దాడి చేయడానికి వెళ్లే ముందు తాను వాడే సెల్ ఫోన్ ను స్విచ్ఛాఫ్ చేస్తాడు. వృద్ధులను చంపిన తర్వాత ఉషయ్య ఫోన్ నుంచి తన నంబర్ కు ఫోన్ చేసుకున్నాడు. ఈ ఫోన్ నంబర్ ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు.



వేలిముద్రలతో దొరికిన శివకుమార్

2023 మే నెలలో కందుకూరు మండలం దాసర్లపల్లి గ్రామానికి చెందిన శైలజా రెడ్డి(42)ని కూడా శివకుమార్ హత్య చేశాడు. ఆ మహిళ హత్య కేసులో పోలీసులకు వేలిముద్రలు తప్ప ఏ ఆధారం దొరకలేదు. దీంతో కేసు పెండింగ్‌లో ఉంది. అయితే, వృద్ధ దంపతుల హత్య కేసులో శివకుమార్ వేలిముద్రలు... శైలజా రెడ్డి హత్య కేసులో సేకరించిన వేలిముద్రలతో మ్యాచ్ అయ్యాయి. శైలజా రెడ్డిని కూడా హత్య చేసింది శివకుమారే అని పోలీసులు గుర్తించారు. ఆ మూడు హత్యలను తానే చేశానని నిందితుడు ఒప్పుకున్నాడని పోలీసులు చెప్పారు. అతనిపై కేసు నమోదు చేసి, రిమాండ్ కు తరలిస్తామని సీపీ సుధీర్ బాబు తెలిపారు. కోర్టు ఆదేశాలతో కస్టడీలోకి తీసుకుని విచారిస్తామని పేర్కొన్నారు.

# ఒక్క కాల్.. వీడిన మూడు హత్యల మిస్టరీ

- వృద్ధ దంపతుల హత్య కేసులో నిందితుడి అరెస్టు
- వేలిముద్రల ఆధారంగా మరో మహిళను హతమార్చినట్లు గుర్తింపు

**ఈనాడు, హైదరాబాద్:** ఒక్క ఫోన్‌కాల్.. ముగ్గుర్ని దారుణంగా హత్య చేసిన నిందితుడిని పట్టించింది. దాదాపు ఏడాదిన్నర కాలంగా అంతుచిక్కని ఓ మహిళ హత్య కేసు మిస్టరీని ఛేదించింది. ఈ నెల 16న రంగారెడ్డి జిల్లా కందుకూరులో సంచలనం రేపిన వృద్ధ దంపతుల హత్య కేసులో నిందితుడిని రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. డీసీపీ మురళీధర్, ఏడీసీపీ సత్యనారాయణ, ఏసీపీలు లక్ష్మీకాంతరెడ్డి, నరేందర్, కందుకూర్ ఇన్‌స్పెక్టర్ సీతారాంతో కలిసి కమిషనర్ జి.సుధీర్‌బాబు శనివారం ఎల్బీనగర్‌లో కేసు వివరాలు వెల్లడించారు.



**వివరాలు వెల్లడిస్తున్న సీపీ సుధీర్‌బాబు. చిత్రంలో డీసీపీ మురళీధర్, ఏడీసీపీ సత్యనారాయణ, ఏసీపీలు లక్ష్మీకాంతరెడ్డి, నరేందర్**

**మద్యం మత్తులో దారుణం:** కందుకూరు మండలం దాసర్లపల్లికి చెందిన ఉప్పుల శివకుమార్(25) బ్యాండ్ ప్లేయర్‌గా పనిచేస్తుంటాడు. మద్యానికి అలవాటుపడ్డాడు. లైంగిక వాంఛ తీర్చుకోవడానికి ఒంటరిగా ఉండే మహిళల్ని ఎంచుకుంటాడు. వ్యవసాయ క్షేత్రాలు, ఫాంహౌస్‌ల దగ్గర ఉండే మహిళలు ఇతడి లక్ష్యం. ఈ క్రమంలోనే కందుకూరు సమీపంలోని కొత్తగూడలోని మామిడితోటలో పనిచేసే నాగర్‌కర్నూల్ జిల్లా ముష్టిపల్లికి చెందిన మూగ శాంతమ్మ(65)ను లక్ష్యంగా చేసుకున్నాడు. ఆమె తన భర్త మూగ ఊశయ్య(70)తో కలిసి మామిడితోటలోనే ఒక షెడ్డులో ఉంటోంది. ఈ నెల 15న మద్యం తాగిన శివకుమార్.. తన ఫోన్ ఇంట్లోనే పెట్టి రాత్రి 7.30 తర్వాత వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాడు. షెడ్డు దగ్గర వృద్ధురాలు ఒంటరిగా ఉండటంతో బలవంతంగా లొంగదీసుకోవాలనుకున్నాడు. ఆమె ప్రతిఘటించడంతో వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా నరికాడు. వ్యవసాయ క్షేత్రంలోనే కొద్దిదూరంలో ఉన్న వృద్ధురాలి భర్త ఇటువైపు రావడం చూసి కత్తితో మెడ, ఇతర భాగాల్లో నరికి చంపాడు. అక్కడి నుంచి పరారయ్యాడు.

**పట్టించిన ఫోన్ కాల్:** ఘటన జరిగిన చోట నిందితుడు తిరిగిన ఆనవాళ్లు మినహా ఇతర ఆధారాలేవీ చిక్కకపోవడంతో పోలీసులు కేసు సవాల్‌గా తీసుకున్నారు. ఐటీసెల్ ఏసీపీ నరేందర్ బృందం సాంకేతిక ఆధారాల మీద దృష్టిసారించింది. హత్య జరిగిన తర్వాత మృతుడి ఫోన్ నుంచి ఒక నంబరుకు కాల్ వెళ్లింది. డయల్ చేసిన నంబరు ఆధారంగా ఉప్పుల శివకుమార్ అని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. గట్టిగా ప్రశ్నించగా వృద్ధ దంపతుల్ని హత్య చేసినట్లు అంగీకరించాడు. అతడి వేలిముద్రల్ని ఫింగర్‌ప్రింట్ బ్యూరోతో తనిఖీ చేయించగా.. ఏడాదిన్నర క్రితం ఓ మహిళ హత్య కేసులో లభ్యమైన వేలిముద్రలతో సరిపోలడంతో పోలీసులు విస్తుపోయారు.

**పగిలిన మద్యం సీసాపై వేలిముద్రలు:** గతేడాది మార్చి 3న కందుకూరుపరిధి దాసర్లపల్లిలోని అరుణ ఫాంహౌస్‌లో పనిచేసే నెల్లూరు జిల్లా ఓజిలి మండలానికి చెందిన చెంచు శైలజారెడ్డి(42) దారుణ హత్యకు గురయ్యారు. మృతదేహం పక్కన పగిలిన వోడ్కా సీసాపై వేలిముద్రలు మినహా ఇతర ఆధారాల్లేక హంతకుడు చిక్కలేదు. లైంగిక వాంఛ తీర్చనందుకు శైలజారెడ్డిని శివకుమార్ హత్య చేసినట్లు తేలింది. హత్య చేశాక పోలీసుల కదలికల్ని దగ్గరుండి గమనించినట్లు సమాచారం. శైలజారెడ్డిని హత్య చేశాక పోలీసులు కత్తులు ఇతర ఆధారాలకు వెదికినప్పుడు సాయం చేసినట్లు తెలుస్తోంది.